తల్లికి వందనం ఎప్పుడో?


ప్రభుత్వ బడిలో చదువుతున్న విద్యార్థులు

- ఇంకా తల్లులకు జమకాని డబ్బులు
- అయోమయంలో పడేసిన ప్రభుత్వ జీఓ
- దారిద్య్రరేఖ దిగువన ఉన్నవారికి మాత్రమే అంటూ ప్రచారం

నగరి/కార్వేటినగరం: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకం ద్వారా ఎందరో విద్యార్థులను బడిబాట పట్టించింది. జగనన్న విద్యాకానుక, అమ్మఒడితో పేదింట చదువులకు బంగారు బాట వేసింది. దీంతో లక్షలాది మంది తల్లిదండ్రులు తమ పిల్లలను చక్కగా బడికి పంపారు. ప్రస్తుతంప్రభుత్వం మారడంతో పథకం అమలవుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది జూన్ 28వ తేదీన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి సొమ్ము జమ అయింది. నగరి నియోజకవర్గంలో 319 పాఠశాలల్లో అర్హులుగా గుర్తించిన 1,91,22 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు గత ఏడాది అమ్మ ఒడి డబ్బులు జమ య్యాయి. అయితే ఈ సంవత్సరం అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో విద్యార్థుల చదువుకు అండగా నిలుస్తానని ఎన్నికల హామీ ఇచ్చింది. గతంలోలా కుటుంబానికి ఒకరు కాకుండా ఎంత మంది ఉంటే అంత మందికి తల్లికి వందనం పేరుతో ఒకరికి రూ.15 వేలు చొప్పున అందిస్తామని తెలిపింది. అయితే జూలై వచ్చినా డబ్బులు జమకాక పోగా ఎప్పుడు పడుతుందో అన్న సందేహం విద్యార్థుల తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది

గత ఏడాది అర్హత పొందిన విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	మొత్తం విద్యార్థుల సంఖ్య	అర్హత పొందిన విద్యార్థులు
నగరి	115	12535	7285
పుత్తూరు	108	12526	6366
విజయపురం	48	2181	2071
నిండ్ర	48	2169	1504
వడమాలపేట	49	3058	1896
మొత్తం	319	32,469	1,91,22

భయపెడుతున్న జీఓ

తల్లికి వందనం పథకం అమలుకు ప్రభుత్వం నూతన జీవో విడుదల చేసింది. ఇందులో మార్గదర్శకాలపై స్పష్టత లేకపోవడంతో తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. దారిద్య్ర రేఖకు దిగువన ఉన్నవారికి మాత్రమే డబ్బులు జమ అవుతాయన్న ప్రచారం మొదలైంది. కుటుంబానికి ఒక్కరికే వచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. కొత్త మార్గదర్శకాలతో తమకు తల్లికి వందనం వస్తుందా? రాదా? అనే సందేహం వారిని వెంటాడుతోంది.

తల్లికి వందనం జాప్యం



నాకు ఇద్దరు పిల్లలు పెద్దకుమారుడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రెండవ కుమారుడు ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. గత ఏడాదికి ఒకరికి అమ్మ ఒడి పథకంలో డబ్బులు జమ అయ్యాయి. ప్రస్తుతం తల్లికి వందనం పథకంలో ఇద్దరికీ డబ్బులు జమ అవుతుందన్నారు. గత ఏడాది జూన్ నెలలోనే వచ్చేసింది. ప్రస్తుతం జూలై అవుతున్నా రాలేదు. కొత్త జీవో ప్రకారం లెక్కిస్తారని పాఠశాలల్లో చెబుతున్నారు. కొత్త జీవోకు, మార్గదర్శకాలు రావడానికే చాలా జాప్యం అవుతోంది. డబ్బులు వస్తే పిల్లల విద్యాభివృద్ధికి ఎంతో సాయంగా ఉంటుంది. – ఆర్. భారతి, ముడిపల్లి, నగరి మండలం

మార్గదర్శకాలు రాలేదట



నాకు ఇద్దరు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. గతంలో నాలుగు సార్లు అమ్మ ఒడి పథకంలో డబ్బులు జమ అయ్యాయి. అది పిల్లల చదువుకు ఎంతో ఉపయోగపడింది. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమై నెలరోజులవుతున్నా ఇంకా డబ్బులు జమ కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం తల్లికి వందనం పథకంలో ఎందరు పిల్లలున్నా వారికి డబ్బులు జమ చేస్తామని తెలిపింది. తల్లికి వందనం పథకం కోసం ఎదురుచూస్తున్నాం. పాఠశాలలో అడిగితే ఇంకా మార్గదర్శకాలు రాలేదని తెలుపుతున్నారు. – సుశీల, అత్తూరు, నిండ్ర మండలం

ఇస్తారో..లేదో తెలియదు



గత ప్రభుత్వం పాఠశాల ప్రారంభించిన వెంటనే అమ్మ ఒడి జమ చేసేవారు. అయితే సీఎం చంద్రబాబునాయుడు తల్లికి వందనం పథకం కింద ఇంట్లో విద్యార్థులు ఎంతమంది ఉన్నా వారి తల్లి ఖాతాల్లో రూ.15 వేల చొప్పున జమ చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడేమో ఒక్కరికే అంటున్నారు. అదికూడా ఇస్తారో లేదో తెలియదు. పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.
– రోజా, బిల్లుదొన గ్రామం, కార్వేటినగరం మండలం

ఒకరికే అంటున్నారు



ప్రభుత్వాన్ని నమ్ముకుని పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పించా. నెల గడుస్తున్నా తల్లికి వందనం పథకం ఊసే లేదు. పాఠశాల యాజమాన్యం ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇద్దరు కొడుకులను ప్రైవేటులో చేర్పించి ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాను. టీడీపీ మేనిఫెస్టోలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి అన్నారు. ఇప్పుడేమో ఒకరికే అంటున్నారు. ఫీజులు చెల్లించలేక ఇబ్బందిపడుతున్నాం.
– రత్నమ్మ, ఆళ్లమడుగు గ్రామం, వెదురుకుప్పం మండలం

క్లుప్తంగా

నేటి నుంచి మహాభారత ఉత్సవాలు

కార్వేటినగరం: నేటి నుంచి కార్వేటినగరంలో వార్షిక మహాభారత వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు పోకల సోమనాథ్ తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గురువారం నుంచి వార్షిక మహాభారత ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 12వ తేదీ శుక్రవారం ఆలయ ఆవరణలో ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

సబ్‌స్టేషన్ తనిఖీ


సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఈ మునిచంద్ర

గంగాధర నెల్లూరు: మండలంలోని పెద్దకాలవ పంచాయతీకి చెందిన ఎల్లమ్మరాజు పల్లి వద్ద గల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మునిచంద్ర ఆకస్మిక తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుల రిజిస్టర్ కచ్చితంగా ఉంచాలని, ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన ప్రతి ఒక్క విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. అలాగే వర్షాభావ పరిస్థితులలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి తెలిపారు. హై టెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్న ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మండల ఏఈ రాజా పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పాలసముద్రం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చిందని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. చెన్నై నేత్రా నిలయం నుంచి వచ్చిన వైద్యులు కంటి పరీక్షలు చేశారు. శిబిరంలో 121 మందికి కంటి పరీక్షలు చేశారు. అందులో 52 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. ఉచితంగా మందులు కూడా అందిస్తామని తెలిపారు. ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తక్కువ ధరకే కందిపప్పు


కందిపప్పు అందిస్తున్న ఆర్డీఓ

నగరి : వినియోగదారులకు మర్చంట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో తక్కువ ధరకే కందిపప్పు అందిస్తున్నట్లు ఆర్డీఓ వెంకటరామిరెడ్డి తెలిపారు. తక్కువ ధరకు సరుకులను విక్రయించేందుకు మర్చంట్స్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన షాపును గురువారం ఆయన ప్రారంభించారు. ఆర్డీఓ మాట్లాడుతూ కిలో బియ్యం రూ.48కి, స్టీమ్డ్ బియ్యం రూ.49కి, కందిపప్పు రూ.160కి అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి శంకరన్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, నగరి మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు భూపతినాయుడు, కార్యదర్శి రవి, ఉపకార్యదర్శులు నాగరాజు, మురళి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి


బాబు (ఫైల్)

నిండ్ర: మండలంలోని నెట్టేరి గ్రామం దళితవాడకు చెందిన ఎ.బాబు (45) వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా వ్యవహరించేవారు. ఆయన గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. బాబు కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వరి సాగులో సస్య రక్షణ చర్యలు


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ

పాలసముద్రం: వరి, వేరుశనగ పంటలో వచ్చే చీడ, పీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. గురువారం పాలసముద్రంలో రైతులకు క్షేత్ర సందర్శనలో భాగంగా వరి, వేరుశనగ సమగ్ర యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వరి సాగులో చీడ, పీడల వల్ల కలిగే నష్టాలు, వాటి సస్యరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సాగుచేసిన వేరుశనగ పంటను పరిశీలించారు.

వేడుకగా బాబాకు పాలాభిషేకం


స్వహస్తాలతో బాబాకు పాలాభిషేకం చేస్తున్న భక్తులు

పుత్తూరు: పట్టణంలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం బాబాకు భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం వేడుకగా నిర్వహించారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పాలాభిషేకం కార్యక్రమం తెల్లవారుజామున 4.30 గంటల నుంచి 11 గంటల వరకు కొనసాగింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు క్యూలో వేచి ఉండి పాలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు వేకువజాము 2.30 గంటలకు సుప్రభాతసేవతో బాబాను మేల్కొలిపారు. 3–30కు కాగడా హారతిని ఇచ్చి, 4 గంటలకు మంగళ స్నానం, విష్ణుసహస్రనామం నిర్వహించారు. అనంతరం బాబా మూలవిరాట్‌కు పాలాభిషేకం చేయడానికి భక్తులను అనుమతించారు. పాలాభిషేకం అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు హారతి, 12.30 గంటలకు మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు సంధ్య హారతి, 8 గంటలకు మంగళ హారతినిచ్చి పవళింపు సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

సన్మానం



కార్వేటినగరం: బదిలీపై వెళుతున్న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు లావణ్యను ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి, సహచర అధ్యాపకులు ఆమె చేసిన సేవలను కొనియాడారు. లావణ్యను దుశ్శాలువలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

పంటకు ఊరట

విజయపురం : మూడు రోజులుగా పడుతున్న చిరుజల్లులతో పంటలకు ఊపిరి వచ్చింది. ఈ ఏడాది ఎండ తీవ్రతకు చెరకు పంటకు సరిపడా నీరు లేకపోవడంతో ఎండిపోయింది. ప్రస్తుతం కురుస్తున్న చిరుజల్లులతో పంటలకు కళ వచ్చింది. ఇటీవల వేసిన వరి, ఆరుతడి పంటలైన కూరగాయలు, అంతర పంటలకు మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బోర్లు, బావుల్లో నీటి మట్టం పెరిగింది. బీడు భూముల్లో పచ్చగడ్డి కనిపిస్తుండడంతో, మూగజీవులకు మేత దొరుకుతుందని రైతులు చెబుతున్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



నిండ్ర: మండలంలోని కైపాకంలో గురువారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అంబలి పోశారు. మధ్యాహ్నం అమ్మవారిని గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు కర్పూర హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామం విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


సి.అంజేరప్ప


జి.తరుణ్


పి.హేమ

పుత్తూరు: ప్రభుత్వం ప్రకటించిన ట్రిపుల్ ఐటీ సీట్లలో వడమాలపేట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సి.అంజేరప్ప, జి.తరుణ్, పి.హేమ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కరుణా నవనీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తరుణ్‌కు నూజివీడులో, అంజేరప్ప, హేమకు ఇడుపులపాయలో సీట్లు కేటాయించినట్లు తెలిపారు. 2023–24 ఏడాదికి 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో అంజేరప్ప, తరుణ్ 573 మార్కులు, హేమ 572 మార్కులు సాధించి, ట్రిబుల్ ఐటీకి అర్హత సాధించినట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం కరుణానవనీత, ఎంఈఓలు పద్మావతమ్మ, తులసీరామ్, ఉపాధ్యాయులు అభినందించారు.

బలిజకండ్రిగ విద్యార్థి..


అశ్విత (ఫైల్)

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అశ్విత ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రఘు తెలిపారు. పది పబ్లిక్ పరీక్షల్లో 600 మార్కులకు 567 మార్కులు సాధించిన అశ్విత పాఠశాలలో ప్రథమ స్థానంలో నిల్చింది. అశ్వితని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

జనాభా నియంత్రణతోనే సంక్షేమం


జనాభా నియంత్రణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం: జనాభా నియంత్రణతోనే కుటుంబ సంక్షేమని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్ తెలిపారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం పురష్కరించుకుని సమావేశం ఏర్పాటు చేశారు. డాక్టర్ మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ జనాభాను నియంత్రించాలంటే ఒకరు లేదా ఇద్దరు బిడ్డలకు కుటుంబ నియంత్రణ చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఆరోగ్యసిబ్బంది కలసి మండల కేంద్రం వరకు ర్యాలీ చేశారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళి, సుశీల, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించండి


విద్యార్థుల నైపుణ్యతను పరిశీలిస్తున్న ఎంఈఓ

నగరి : వెనుకబడిన విద్యార్థులకు బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించాలని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. నగరి పేట ప్రాథమిక పాఠశాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల నైపుణ్యతను పరిశీలించారు. ఆంగ్లంలో 80 శాతం విద్యార్థులు బాగా శిక్షణ పొంది ఉండడంతో వారిని అభినందించారు. వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేక తర్ఫీదును ఇచ్చి బేస్‌లైన్ టెస్టులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

పెనుమూరు(కార్వేటినగరం): పంట సాగులో సస్యరక్షణ పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత వై.రెడ్డి రాము అన్నారు. గురువారం అట్లవారిపల్లి, సంగీత గోపనపల్లి, ఉగ్రాణపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన వేరుశనగ, వరి పంటలను పరిశీలించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేతలు డాక్టర్ పి.నాగమణి, మండల వ్యవసాయ అధికారి ఢిల్లీబాబు, రైతులు పాల్గొన్నారు.


నారుమడులను పరిశీలిస్తున్న శాస్త్రవేతలు

అయ్యప్ప ఆలయంలో ఉత్తరా నక్షత్ర పూజలు

నగరి : పట్టణ పరిధి బైపాస్ కూడలి సమీపంలోని శ్రీ ధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం అయ్యప్పస్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప పాటల భజనలు, అర్చన మంత్రాలను అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు భజనలు చేయడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఆలయంలో భక్తులకు సహపంక్తి భోజనం పెట్టారు. భక్తులు వసంతమ్మ ఉభయదారులుగా వ్యవహరించారు. గురుస్వామి మురళి, భక్తులు కన్నప్ప, మునస్వామి, ఎల్లప్పరెడ్డి, రమేష్ బాబు, దుర్గాప్రకాష్ స్వామి పాల్గొన్నారు.


ఆలయ సహపంక్తి భోజనంలో భక్తులు